క్లుప్తంగా

శిథిలావస్థలో పాటిపల్లి మోడల్ స్కూల్ రోడ్డు



శిథిలావస్థకు గురైన మోడల్ స్కూల్ రోడ్డు

మునగపాక : మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్‌కు వెళ్లే రోడ్డు శిథిలావస్థకు గురైంది. ఈ రోడ్డు మార్గంలో రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడుతున్నారు. మోడల్ స్కూల్లో చదువుకునేందుకు వెళ్లే విద్యార్థులతో పాటు కాకరాపల్లి, రాజుపేట, తోటాడ తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించేవారు పడరాని పాట్లు పడుతున్నారు. రోడ్డుపై రాళ్లు తేలిపోవడంతో పాదచారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారి మెరుగునకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

స్కౌట్ మాస్టారు సత్యనారాయణ ఇకలేరు



మందపాటి సత్యనారాయణ

మునగపాక : మునగపాకకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు మందపాటి సత్యనారాయణ(77) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో సత్యనారాయణ స్కౌట్ మాస్టారుగా గుర్తింపుపొందారు.1971లో ఉపాధ్యాయ వృత్తి చేపట్టిన సత్యనారాయణ పలు పాఠశాలల్లో ఉపాధ్యాయునిగా పనిచేసి 2006లో పదవీ విరమణ చేశారు. స్కౌట్‌పై ఉన్న మమకారంతో మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో ఉచితంగా సేవలందించేవారు. విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెంచడం, స్కౌట్‌పై అవగాహన కల్పించడంలో సత్యనారాయణ మాస్టారు ఎంతో గుర్తింపు పొందారు. కాగా కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సత్యనారాయణ మాస్టారు శనివారం మృతి చెందారు. ఆయన అంత్యక్రియల్లో పలువురు పూర్వపు విద్యార్థులు, ,గ్రామస్తులు పాల్గొన్నారు.

అరటి సాగులో మెలకువలపై అవగాహన



అరటి గెలలకు కవరు కట్టడంపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

రావికమతం: అరటి సాగులో మెలకువలపై ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు మేడివాడ రైతులకు శనివారం అవగాహన కల్పించారు. గ్రామీణ వ్యవసాయంలో మెలకువలు, యాంత్రీకరణ పద్ధతులను రైతులకు వివరించే కార్యక్రమంలో భాగంగా మేడివాడ గ్రామానికి చెందిన గొర్లె కృష్ణ,గంటా నాయుడు అరటి తోటలను వారు పరిశీలించారు. గెలలకు కవరు కట్టే విధానాన్ని వివరించారు. కవరు కట్టడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీసీ రాజ్‌కుమార్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ హరి

గొలుగొండ: ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్ప వని నర్సీపట్నం రూరల్ సీఐ బి.హరి హెచ్చరించారు. అన్ని రాజకీయపార్టీల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్‌ను ఎవరూ ఉల్లంఘించరాదన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరు పోలీసులకు సహకరించాలని కోరారు. గ్రామాల్లో బాణసంచా, సౌండ్ బాక్సుల వినియోగం, ఊరేగింపులు నిషేధమని తెలిపారు. నాయకుల గెలుపు, ఓటమిలపై బెట్టింగులు కాస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో గొలుగొండ ఎస్‌ఐ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలతో విజ్ఞానం



కోటవురట్ల శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులు



ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కోటవురట్ల : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం శనివారం నిర్వహించారు. గ్రంథాలయాధికారి అప్పలనాయుడు శిబిరాన్ని నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ శిబిరంలో పుస్తక పఠనం, కథలు చెప్పడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం స్వచ్ఛభారత్ అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. రీసోర్స్ పర్సన్‌గా ఉపాధ్యాయుడు మస్తాన్ వ్యవహరించారు. విద్యార్థులు గ్రంథాలయ సందర్శనను అలవాటుగా చేసుకోవాలని సూచించారు.

ధ్యానంతో మేధోశక్తి పెరుగుదల

అచ్యుతాపురం : విద్యార్థులు తెల్లవారు జామున 5 గంటలకు నిద్ర లేచి ధ్యానం పాటిస్తే మేధాశక్తి పెరుగుతుందని ఉపాధ్యాయులు అప్పారావు అన్నారు. అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా రోజుకొక అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ధ్యానం ప్రాధాన్యం, ఆవశ్యకత, ఉపయోగాల గురించి అప్పారావు వివరించారు. ధ్యానం చేయడం ద్వారా మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. తద్వారా సానుకూల ఆలోచనలు ఏర్పడతాయని తెలిపారు. యోగసనాలు కూడా వేయాలని సూచించారు. అవగాహన కార్యక్రమానికి విచ్చేసిన విద్యార్థులకు లైబ్రేరియన్ మిఠాయిలు అందజేశారు.

పలు అంశాలపై విద్యార్థులకు శిక్షణ

రాంబిల్లి : దిమిలి శాఖా గ్రంథాలయంలో శనివారం వేసవి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు తమ నైపుణ్యంతో పేపర్ క్రాఫ్ట్‌లను తయారు చేసి వాటిని ప్రదర్శించారు. పుస్తక పఠనంపై తర్ఫీదు ఇచ్చారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ ఎస్. శకుంతల మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఉపయోగపడేలా పలువురు రీసోర్స్ పర్సన్స్‌తో విద్యార్థులకు పలు ఆటలు, నీతి కథలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.



దిమిలి గ్రంథాలయంలో పేపర్ క్రాఫ్ట్‌లతో విద్యార్థులు

కౌంటింగ్ సందర్భంగా అల్లర్లకు దూరంగా ఉండాలి



ఉప్పరాపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ విభీషణరావు

ఎస్.రాయవరం : ఎన్నికల పోలింగ్ ముగిసింది, కౌంటింగ్ వరకు ప్రశాంత వాతావరణం నెలకొనాలని ఎస్‌ఐ విభీషణరావు అన్నారు. మండలంలో ఉప్పరాపల్లి గ్రామంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల కౌంటింగ్ రోజున గ్రామంలో ఎటువంటి అల్లర్లకు తావివ్వకుండా స్థానిక యువత, రాజకీయపార్టీల నాయకులు వ్యవహరించాలని సూచించారు. పోలీసుల హెచ్చరికలను ఎవరు అతిక్రమించినా కఠిన చర్యలు తప్పవని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శానాపతి శ్రీరాములు, స్థానిక యువకులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో స్ఫేసెస్ విద్యార్థుల ఘనత



కె.జయంతి



బి.తేజశ్రీ

పాయకరావుపేట : శ్రీ ప్రకాష్ అనుబంధ సంస్థ అయిన స్పేసెస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆంధ్ర యూనివర్సిటీ 2024 డిగ్రీ ఫలితాల్లో బీఎస్సీ కంప్యూటర్స్ చదువుతున్న కె.జయంతి 9.66 సీజీపీఏ సాధించి అనకాపల్లి జిల్లాలో మొదటి ర్యాంకు సాధించింది. బీబీఏ చదువుతున్న బి.తేజశ్రీ 8.57 సీజీపీఏ సాధించి జిల్లాలో రెండో ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా తమ డిగ్రీ కాళాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు, అత్యుత్తమమైన విద్యా విధానం వల్ల తమ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారని విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సి.హెచ్.విజయ్ ప్రకాష్ తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని అభినందించారు.

3న పలు దేవాలయాల భూములకు వేలం

మునగపాక : మండలంలోని పలు దేవాలయాల భూముల కౌలుకు జూన్ 3న వేలంపాట జరుగుతుందని దేవదాయ శాఖ కార్యనిర్వాహక అధికారి పి.సత్యనారాయణ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. పాటిపల్లిలో 3.48 ఎకరాలు, ఒంపోలుకు సంబంధించి 1.92 ఎకరాలు, అనకాపల్లి సోత్‌కు సంబంధించి 1.96 ఎకరాలు, తోటాడకు సంబంధించి 1.78 ఎకరాలు వెరసి 9.14 ఎకరాల మేర దేవదాయ శాఖకు చెందిన భూములున్నాయన్నారు. సంబంధిత భూములకు వేలం పాట నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాటిపల్లిలోని అహోబిల లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో జూన్ 3వ తేదీన ఉదయం 11 గంటలకు వేలం పాట జరుగుతుందన్నారు. మూడేళ్ల కాల పరిమితికి వేలం పాట ఉంటుందన్నారు. 04-06-2024 నుంచి 03-06-2027 వరకు కాల పరిమితి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని పాటదారులు సద్వినియోగం చేసుకోవాలని మూర్తి కోరారు.

పైపులైన్‌కు రంధ్రం

17 గ్రామాలకు నిలిచిన నీటి సరఫరా



వృథాగా పోతున్న నీరు

మాకవరపాలెం: పైపులైన్‌కు రంధ్రం పడడంతో 17 గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. మండలంలోని గిడుతూరు శివారు వరాహనదిలో ఉన్న భారీ తాగునీటి ప్రాజెక్టు నుంచి మండలంలోని సుమారు 40గ్రామాలకు నిత్యం తాగునీరు సరఫ రా అవుతుంది. నీటిని సరఫరా చేసే పైపులైన్‌కు కొండలఅగ్రహారం వద్ద శనివారం రంధ్రం పడింది. దీంతో జి.గంగవరం, సీతన్నఅగ్రహారం, శ్రీరాంపురం,హరప్పాఅగ్రహారం ,గిడుతూరు,బయ్యవరం, ఎన్.జి.ఆర్.పి. అగ్రహారం, తామరం, రాచపల్లి, కొత్తపాలెం, బి.బి.పాలెం,చింతూలూరు, దుంగలవానిపాలెం, గండిపేట, జెడ్.గంగవరం, శెట్టిపాలెం,వెంకన్నపాలెం గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. రంధ్రం పడిన చోట తాగునీరు వృథాగా పోతోంది. మూడు రోజుల్లో పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి మళ్లీ యథావిధిగా నీటిని సరఫరా చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శివారెడ్డి తెలిపారు.

పర్తి యాత్రకు సత్యసాయి భక్తులు తరలిరావాలి



పెదనందిపల్లిలో సత్యసాయి బాబా చిత్రపటం వద్ద పూజ చేస్తున్న జిల్లా అధ్యక్షుడు అప్పలనాయుడు

దేవరాపల్లి: పుట్టపర్తిలో అక్టోబర్‌లో జరిగే పర్తియాత్రకు జిల్లా వ్యాప్తంగా వేలాదిగా సత్యసాయి భక్తులు తరలిరావాలని భగవాన్ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు కోరారు. మండలంలోని పెదనందిపల్లిలో శనివారం సత్యసాయి సేవా సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సత్యసాయి బాబా చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కశిరెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ పుట్టపర్తిలో ఏటా మాదిరిగా అక్టోబర్ 23 నుంచి 25 వరకు పర్తి యాత్ర ఘనంగా జరుగుతుందన్నారు. ఈ యాత్రకు జిల్లాలోని అన్ని మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చేలా అందరూ కృషి చేయాలన్నారు. ఎప్పటి మాదిరిగా ఆధ్యాత్మిక సమావేశాలు, భజనలు, బాల వికాస్ తరగతులు యథావిధిగా కొనసాగించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో దేవరాపల్లి మండల సత్య సాయి సేవా సమితి నూతన అధ్యక్షుడిగా ఆదిరెడ్డి చినకన్నబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాడు అప్పారావు, గంధం సూర్యం, రమామణి, సీహెచ్.వి. రవిశంకర్, జగన్నాథం తదితర సత్య సాయి సేవా సమితి ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.


గడ్డి విక్రయాలతో రైతులకు ఆదాయం



ట్రాక్టర్‌తో తరలిస్తున్న వరి గడ్డి

రాంబిల్లి : వరి గడ్డి వ్యాపారం దాదాపు ముగిసింది. రాంబిల్లి మండలం నుంచి ఖరీఫ్, రబీ సీజన్లలో పండించిన వరి నూర్పిడి అనంతరం గడ్డిని వ్యాపారులు కొనుగోలు చేసి ట్రాక్టర్ల సాయంతో పలు మండలాలకు తరలించి విక్రయించారు. పొలాల్లో గడ్డి కుప్పలను దాదాపు తరలించే ప్రక్రియ ముగిసింది. ఎకరాలో పండించిన వరి గడ్డి రూ.5 వేల నుంచి 6 వేలకు రైతులు వ్యాపారులకు విక్రయించారు. ఇలా కొనుగోలు చేసిన గడ్డిని పలు మండలాలకు తరలించి విక్రయాలు జరిపారు. గడ్డి విక్రయంతో రైతులకు అదనపు ఆదాయం సమకూరింది.

ఎండ వేడిమి నుంచి ఊరట



ఆకాశం మేఘావృతమైన దృశ్యం

రాంబిల్లి : ఎండలతో అల్లాడిన ప్రజలు చల్లబడిన వాతావరణాన్ని ఆస్వాదిస్తున్నారు. శనివారం ఆకాశం దట్టంగా మేఘావృతమై తేలికపాటి చినుకులు పడ్డాయి. చల్లని గాలులు వీచాయి. ఎండలు, వేడిగాలులకు ఉక్కిరిబిక్కిరైన ప్రజలు చల్లని వాతావరణంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరో పక్క రైతులు ఖరీఫ్ పనులకు శ్రీకారం చుడుతున్నారు. నారుమడులు తయారీలో భాగంగా దుక్కి పనులు చేస్తున్నారు. మరోపక్క వ్యవసాయ శాఖ వరి విత్తనాలను సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

పచ్చిరొట్ట విత్తనాలతో భూసారం వృద్ధి

చీడికాడ: పచ్చిరొట్ట విత్తనాలు వేయడం వల్ల భూసారం వృద్ధి చెందుతుందని మండల వ్యవసాయాధికారి కె.రమాదేవి తెలిపారు. దుక్కి దున్నిన పొలంలో నేల స్వభావాన్ని బట్టి పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగు, జనుమలలో ఏదో ఒక దానిని జల్లుకోవాలని రైతులకు సూచించారు. మండలంలో జీలుగు విత్తనాలు 15.80 క్వింటాళ్లు, జనుము 2.20 క్వింటాళ్లు, పిల్లి పెసర విత్తనాలు 1.54 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు.

డి.అగ్రహారంలో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు



డి.అగ్రహారంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రాజ్‌కుమార్

కె.కోటపాడు : ప్రజలకు మెరుగైన వైద్య సేవల ను ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా అందిస్తున్నట్టు వైద్యాధికారి రాజ్‌కుమార్ తెలిపారు. డి.అగ్రహారంలో శనివారం ఫ్యామిలీ ఫిజీషియన్ నిర్వహించి, 129 మందికి వైద్య పరీక్షలు జరిపారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు.ఎంఎల్‌హెచ్‌పీ మీనాక్షి, ఏఎన్‌ఎం ముత్యవమ్మ, హెచ్.వి.భాగ్యలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐఎఫ్‌పీల ఏర్పాటుపై పాఠశాల తనిఖీ



రేవుపోలవరం పాఠశాలలో తనిఖీ చేస్తున్న విద్యా కమిటీ చైర్మన్

ఎస్.రాయవరం : రేవుపోలవరం ఉన్నత పాఠశాలలో ఐఎఫ్‌పీల ఏర్పాటు సక్రమంగా లేదన్న ఫిర్యాదు మేరకు శనివారం పాఠశాలలో ఉపాధ్యాయులు సమక్షంలో పాఠశాల కమిటీ చైర్మన్ బోడిపల్లి అప్పన్న తనిఖీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నాడు నేడు పథకంలో విద్యార్థులకు నాణ్యమైన బోధన చేపట్టాలనే ఉద్దేశంతో మూడు నెలలు క్రితం పాఠశాలలో ఐఎఫ్‌పీ సామాగ్రి సమకూర్చారు. పాఠశాలలకు చేరిన వెంటనే వైరింగ్ చేయించి వీటిని ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే ఈ పాఠశాలలో మాత్రం పూర్తి స్థాయిలో బిగించకుండానే ఏర్పాటు చేసినట్టు స్థానిక ఉపాధ్యాయులు నివేదిక ఇచ్చారని, ఈ విషయంపై డీఈవోకు ఫిర్యాదు చేయాల్సి వచ్చిందన్నారు. ఈ మేరకు పరిశీలనలో ఆదే విషయం బయటపడిందన్నారు. ఈ విషయాన్ని స్థానిక డిప్యూటీ డీఈవో అప్పారావు దృష్టికి తీసుకువెళ్లారు. పాఠశాలలు పునఃప్రారంభంలోపు పూర్తి స్థాయిలో ఐఎఫ్‌పీ బోర్డులు ఏర్పాటు పూర్తి చేసి విద్యాబోధన జరిగేలా చూస్తామన్నారు. ఈ పరిశీలనలో ఉపాధ్యాయులు మూర్తి తదితరులు ఉన్నారు.

తిమ్మరాజుపేట సచివాలయం వద్ద ధర్నా



తిమ్మరాజుపేట సచివాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఉపాధి హామీ కూలీలు

అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట సచివాలయం వద్ద ఉపాధి హామీ కూలీలు శనివారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము, తిమ్మరాజుపేట మాజీ సర్పంచ్ కర్రి అప్పారావు మాట్లాడారు. తిమ్మరాజుపేటలో ఉపాధి హామీ కూలీ పనులు వెంటనే ప్రారంభించి, గత బకాయిల్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం సచివాలయ కార్యదర్శి దీనబంధుకు వినతి పత్రం అందజేశారు. ఎస్.దేవుడు, పి.అప్పలనర్స, జి.లక్ష్మి, పి.నూకరత్నం పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం



మునగపాక అభయాంజనేయ స్వామి ఆలయంలో చాలీసా నిర్వహిస్తున్న దృశ్యం

మునగపాక : స్థానిక సంతబయిల అభయాంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమాన్ చాలీసా పారాయణం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో పారాయణం నిర్వహించారు. జూన్ 1వ తేదీన అభయాంజనేయ స్వామి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. అదే రోజు ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్న సమారాధన జరుగుతుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అభయాంజనేయ స్వామిని దర్శించుకొని కృపకు పాత్రులు కావాలని కోరారు.

పారిశుధ్య చర్యలపై దృష్టి పెట్టండి



గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఈవోఆర్‌డీ చంద్రశేఖర్



చెత్త నుండి సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈవోఆర్‌డీ

పాయకరావుపేట : మండలంలో గల ఆయా గ్రామాల్లో పారిశుధ్య లోపం లేకుండా గ్రామ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఈవోఆర్‌డీ సిహెచ్.చంద్రశేఖర్ సూచించారు. ఆయన శనివారం కేశవరం గ్రామంలో గ్రామ సచివాలయాలను, పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం చెత్త నుంచి సంపద కేంద్రాలను సందర్శించి, సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. పర్యటనలో ఆయన వెంట గ్రామ కార్యదర్శులు వై.సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాగుకు 'మార్గం'సుగమం

- అడవిరాజుబాబు కొండపైకి రోడ్డు నిర్మాణం ప్రారంభం
- తీరనున్న 20 ఏళ్ల కల
- హర్షం వ్యక్తం చేస్తున్న ఎస్సీ రైతులు



శనివారం కొండపైకి వేసిన రహదారిని పరిశీలిస్తున్న ఏపీవో, ఫీల్డ్ ఉద్యోగి



రహదారి నిర్మాణ పనుల్లో కూలీలు

రావికమతం: మండలంలోని ఒమ్మవరం ఎస్సీ రైతుల 20 ఏళ్ల కల సాకారం కానుంది. వారు వ్యవసాయం చేసేందుకు మార్గం సుగమమైంది. ఎమ్మెల్యే కృషి ఫలితంగా రోడ్డు సదుపాయం అందుబాటులోకి వస్తుండడంతో పాటు వారి పొలాలు సాగులోకి రానుండడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒమ్మవరం శివారులో ఉన్న అడవిరాజుబాబు కొండపై సాగుకు అనుకూలమైన 52 ఎకరాల భూమి ఉంది. దీనిని సాగుచేసుకునేందుకు 15 మంది ఎస్సీ రైతులకు 20 ఏళ్ల క్రితం అప్పట్లో ప్రభుత్వం పట్టాలిచ్చింది. అయితే కొండపైకి సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో ఆ రైతులు వ్యవసాయం చేయలేకపోయారు. కొండంతా చెట్లు పెరిగిపోయి అడివిలా మారిపోయింది. దీనిపై ఇన్నాళ్లూ ఎవరూ శ్రద్ధ చూపకపోవడంతో ఆ రైతులు కూడా కూలిపనులు చేస్తూ కుటుంబాలను పోషిస్తున్నారు. రెండు నెలల క్రితం కొండపైకి రోడ్డు వేయాలని ఆ రైతులు ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీని కోరారు. స్పందించిన ఆయన ఉపాధి హామీ పథకంలో రహదారి నిర్మించి, ఆ రైతుల జీవన ప్రమాణం మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. కొండపైకి రహదారి నిర్మాణానికి సాధ్యాసాధ్యాలను అధికారులు పరిశీలించారు. ఒక కిలోమీటరు మేర ఘాట్ మాదిరిగా కొండ తొలచి రోడ్డువేయవచ్చని నిర్ణయానికి వచ్చారు. కొండపై ఉన్న భూములను సైతం అభివృద్ధి చేసి సాగులోకి తేవాలని నిర్ణయించారు. ఈ మేరకు ఉపాధి హామీ పథకం ఏపీవో దాడి వెంకట కాశి అప్పారావు, ఫీల్డ్ అసిస్టెంట్ రామకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ బైరాగి శనివారం పనులను ప్రారంభించారు. రోజుకు 250 మంది కూలీలను ఉపయోగించి పనులు చేస్తామని ఈ సందర్భంగా ఏపీవో కాశి అప్పారావు తెలిపారు.